



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	40.7	26
భద్రాద్రి	41	26



రంజాన్‌వేళలు

ఇఫ్తార్ (సా) : 6:28 (శుక్రవారం)

సహర్ (ఉ) : 4:39 (శనివారం)



సీతారాములకు కోటి గోటి తలంబ్రాలు

భద్రాచలం, ఏప్రిల్ 4: శ్రీసీతారామచంద్రస్వామి వారికి ఆంధ్ర, తెలంగాణ ప్రాంతానికి చెందిన గిరి సేవా సమితి మహిళల ఆధ్వర్యంలో గురువారం క్వింటా గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సమర్పించారు. ఐదు క్వింటాళ్ల బియ్యం, ఒక క్వింటా గోటి తలంబ్రాలు, ఒక కేజీ ముత్యాలు, సీతా రాములకు పట్టువస్త్రాలు, సీతమ్మ తల్లికి సారెను సమర్పించారు. గత ఐదు సంవత్సరాల నుంచి 15వేల మంది భక్తులు గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను తయారు చేసి భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణంకు అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఖమ్మానికి చెందిన శ్రీలక్ష్మీ బాలాజీ సేవా సమితి భక్త బృందం ఆధ్వర్యంలో 200 మంది మహిళల బృందం కోటి గోటి తలంబ్రాలను, సీతమ్మ వారికి సారెను సమర్పించారు. వీరు గత మూడు సంవత్సరాలుగా భక్తితో గోటి తలంబ్రాలను తయారు చేసి స్వామి వారి కల్యాణానికి సమర్పిస్తుంటారు.



రాజ్యసభ సభ్యుడిగా రవిచంద్ర ప్రమాణం

ఖమ్మం కార్పొరేషన్ ఏప్రిల్ 4:: రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన బీఆర్ఎస్ నేత వద్దిరాజు రవిచంద్ర గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ దన్కర్... వద్దిరాజుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి పీయూష్ గోయల్, పలువురు రాజ్యసభ సభ్యులు రవిచంద్రకు శుభాకాంక్షలు తెలిపారు. 2022లో రాజ్యసభ సభ్యుడిగా వున్న బండా ప్రకాశ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన స్థానంలో రవిచంద్ర ఎన్నికయ్యారు. మిగిలిన రెండేళ్లే ఆయన కొనసాగారు. ఇటీవల ఆ పదవీకాలం కూడా పూర్తికావడంతో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రెండోసారి అవకాశం కల్పించారు. 2030వరకు పదవిలో కొనసాగనున్నారు.



సీటీవో వసూళ్లు.. ఏసీబీ తనిఖీలు..

కల్లూరు, ఏప్రిల్ 4: కల్లూరులోని తిరువూరు క్రాస్‌రోడ్డు వద్ద గురువారం తెల్లవారుజామున ఏసీబీ అధికారులు చేసిన ఆకస్మిక తనిఖీల్లో వాణిజ్యపన్నుల అధికారి (సీటీవో) పట్టుబడ్డారు. ఆయన వద్ద అక్రమంగా వున్న రూ.10వేల నగదును సీజ్ చేశారు. సీటీవో శ్రీరామ్ తన సిబ్బందితో తిరువూరు క్రాస్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఏసీబీకి సమాచారం అందింది. దీంతో ఏసీబీ డీఎస్పీ వై.రమేష్, సీఐలు సునిల్, మహేష్‌లు తమ సిబ్బందితో కలిసి తిరువూరు క్రాస్ వద్ద మాటు వేసి రైడ్ చేశారు. ఈ దాడిలో వాణిజ్య పన్నుల అధికారి వద్ద ఉన్న రూ.10వేల నగదును సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి శ్రీరామ్‌తోపాటు అటెండర్ డి.రాజ్‌కుమార్, డ్రైవర్ కె.మణికుమార్‌లపై కేసునమోదు చేసినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సిబ్బంది మండదపు రంగారావు, పుల్లారావు పాల్గొన్నారు.



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

తుక్కుగూడ సభకు

భారీగా తరలాలి

- ఖమ్మం కాంగ్రెస్ ఖ్యాతిని నిలబెట్టాలి
- అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పినా బీఆర్ఎస్‌లో మార్పు రాలేదు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం కాంగ్రెస్ ఖ్యాతిని చాటేలా హైదరాబాదులోని తుక్కుగూడలో జరిగే బహిరంగసభకు భారీసంఖ్యలో పార్టీ శ్రేణులు కదిలిరావాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ఇప్పటినుంచే కార్యోన్ముఖులు కావాలని కోరారు. ఖమ్మంలో గురువారం కాంగ్రెస్ ఖమ్మం నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు బుద్ధిచెప్పినా ఆ పార్టీ నేతల్లో మార్పురాలేదన్నారు. వంద రోజుల కాంగ్రెస్ పాలనపై అబద్ధపు ప్రచారాలు సాగిస్తున్నారని, దీన్ని ప్రతి కార్యకర్త తిప్పికొట్టాలని సూచించారు. 6వ తేదీన జరిగే తుక్కుగూడ సభకు భారీగా జనసమీకరణ చేయాలని ఆదేశించారు.రాష్ట్రంలో గత బీఆర్ఎస్ పాలనపై విమర్శలు గుప్పించారు. అలాగే వందరోజుల్లో కాంగ్రెస్ పాలన సాగించిన ప్రగతిని నివేదించారు.

రాష్ట్రంలో వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.10వేల పరిహారం అందిస్తామని మంత్రి తుమ్మల తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు రూ.300కోట్ల నష్టపరిహారం ఇస్తామని జీవో ఇచ్చి ఒక్కపైసా ఇవ్వలేదన్నారు. అటువంటి ప్రబుద్ధులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని తుమ్మల ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు పంట పరిహారం అందేలా పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకుందన్నారు. గత ప్రభుత్వం ఈ నిర్ణయం ఎందుకు తీసుకోలేకపోయిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పెద్దలకు అధికారం పోయినా ఇంకా అహంకారం తగ్గలేదన్నారు. వంద రోజుల ప్రభుత్వ పాలనలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేసినా.. ప్రభుత్వంపై ఇష్టానుసారంగా విమర్శలు సాగిస్తున్నారన్నారు.

గత వర్షాకాలంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిర్వహణ విషయంలో విఫలమైందన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేయడం వారి అవకాశవాద రాజకీయానికి నిదర్శనమన్నారు. తాము హామీ ఇచ్చినట్టుగా రూ.2లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతామన్నారు. రుణమాఫీ విషయంపై ముఖ్యమంత్రి ఆర్‌బీఐతో మాట్లాడుతున్నారని తెలిపారు. ఖాళీ ఖజానాతో అప్పగించిన ఈ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు నడిపిస్తోందన్నారు. తుక్కుగూడ సభకు భారీగా తరలిరావాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నగర అధ్యక్షుడు జావీద్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

వామపక్షాలతో

కలిసివెళ్తాం

- ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మాకు పోటీనే కాదు
- రాష్ట్రంలో 12కు పైగా లోక్‌సభ సీట్లు గెలుస్తాం
- ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో ఉండేందుకు ఇష్టపడడం లేదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో వామపక్షాలను కూడా కలుపుకొని వెళతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు తమకు పోటీ కానేకాదన్నారు. ఖమ్మం టికెట్ ఎవరికన్నది కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయిస్తుందని స్పష్టం చేశారు. ఖమ్మం పర్యటనలో భాగంగా గురువారం ఆయన జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 12కు పైగా స్థానాలను గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు ఉండేందుకు ఇష్టపడడం లేదన్నారు. వారంతా స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లోకి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లోకి వస్తున్నారని తెలిపారు. వారిలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా ఉండి ఉండవచ్చన్నారు.

రాష్ట్రంలో ఎండల కారణంగా రోజురోజుకు విద్యుత్ వినియోగం పెరుగుతోందని, అయినా డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ అందించి కరెంట్ కోతలు లేకుండా చూస్తామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎండలు పెరుగుతున్నందున విద్యుత్ వినియోగం పెరుగుతోందని, అయినా విద్యుత్ సమస్యను అధిగమించి కోతలు లేకుండా సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా మైక్‌లో మాట్లాడేటప్పుడు కరెంట్ పోతే ఇది కాంగ్రెస్ కరెంట్ అంటూ కేసీఆర్ లాంటి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకుంటూ సీఎం రేవంత్ రెడ్డితోపాటు మంత్రులమంతా ఎవరి శాఖలు వారు సమర్థవంతంగా సమీక్షించుకుంటూ సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు పోతున్నామన్నారు. ప్రజాపాలనతో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం మోడల్‌గా నిలిపిందని భట్టి వివరించారు. వర్షాకాలంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుడు కురిసిన వర్షపు నీటిని నిల్వచేసి సక్రమమైన మార్గంలో రైతులకు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందించలేదన్నారు. అందువల్లనే ప్రస్తుతం ప్రాజెక్టుల్లో నీరులేని పరిస్థితి నెలకొందన్నారు. వేసవి ముంగిట అధికారంలోకి వచ్చిన తమపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కరువు తమ వైఫల్యమేనని చెప్పడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో సుస్థిర ప్రభుత్వం కోసమే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీలో ఉండలేక కాంగ్రెస్‌లోకి స్వచ్ఛందంగా వస్తున్నారని భట్టి గుర్తు చేశారు. ప్రజలు కోరి తెచ్చుకున్న ఈ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్ పెద్దలు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 12కుపైగా స్థానాలను కాంగ్రెస్ గెలిచి తీరుతుందన్నారు. ఖమ్మం కాంగ్రెస్ టికెట్ ఎవరిదన్నది కేంద్ర ఎన్నికల కమిటీ నిర్ణయిస్తుందన్నారు. వామపక్షాలతోపాటు ఎవరు కలిసి వచ్చినా లోక్‌సభ ఎన్నికల్లో కలుపుకొని వెళ్తామని భట్టి వివరించారు. 6న తుక్కుగూడ బహిరంగ సభకు ప్రజలు భారీగా తరలివస్తారని తెలిపారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో

వాష్ రూమ్‌లు

- విధుల్లో పాల్గొనే మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు
- ఖమ్మం జిల్లాలో తొలిసారి ప్రయోగం
- కలెక్టర్ వీపీ గౌతమ్ చొరవ ఫలితం

6

'తుక్కు' తుక్కుగా

దోచుకున్నారు

- కేటీపీఎస్ పాత ప్లాంట్ కూల్చివేత టెండర్లలో గోల్‌మాల్
- సహకరించిన జెన్‌కో ఉన్నతాధికారులు
- సమగ్ర విచారణ జరపాలని బీజేపీ, బీఎస్పీ నాయకుల డిమాండ్

6

కుమార్తె పెళ్లిరోజే

రోడ్డు ప్రమాదం

- ద్విచక్రవాహనంపై వెళ్తూ చెట్టును ఢీకొట్టిన తల్లిదండ్రులు
- తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు
- దగ్గరుండి అమ్మాయి వివాహం జరిపించిన బంధువులు

6

ఖమ్మం జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ మెడికల్ కళాశాల భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం 45 ఎకరాలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రఘునాథపాలెం బైపాస్‌రోడ్డు సమీపంలోని సర్వే నెంబర్ 218లో 13 ఎకరాలు, 218/16/17లో 16.20 గుంటలు, బల్లేపల్లి సర్వేనెంబర్ 137/1లో 11.10 గుంటలు, 138/1లో 5.16 గుంటలు మొత్తం 45 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు హద్దులు కేటాయించి స్థలాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అప్పగించారు.



- రఘునాథపాలెం బైపాస్‌రోడ్డులో 45 ఎకరాల కేటాయింపు
- భవన సముదాయం నిర్మాణానికి రూ.166 కోట్లు
- లోక్‌సభ ఎన్నికల కోడ్ తర్వాత శంకుస్థాపన
- మంత్రి తుమ్మల చొరవతో సాకారమవుతున్న కల

వైద్య కళాశాలకు

మహర్దశ

ఖమ్మం కలెక్టరేట్, ఏప్రిల్ 4: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు రఘునాథపాలెం సమీపంలో కేటాయించిన స్థలంలో రూ. 166కోట్లతో నూతన భవనాలకు శ్రీకారం చుట్టనున్నారు. కళాశాలను ఏర్పాటు చేసిన సమయంలో నగరం నడిబొడ్డున గల పాత కలెక్టరేట్‌లో తాత్కాలికంగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ భవనాలు, ఇతరత్రా ఆధునీకీకరణ పనుల కోసం రూ.8 కోట్లను వెచ్చించారు. మిగిలిన సొమ్ముతో నూతన భవనాలు నిర్మించనున్నారు. తొలుత స్త్రీ, పురుష విద్యార్థులకు విడివిడిగా హాస్టల్ భవనాలు నిర్మించనున్నారు. ప్రిన్సిపాల్ క్వార్టర్లు, కాలేజీ తరగతిగదులు, ఆడిటోరియం, లెక్చర్ హాల్స్ ఇలా మొత్తం 6 అంతస్థులతో నిర్మాణాలు చేపట్టనున్నారు. హాస్టల్ భవనాల కోసం మరో 4 అంతస్థులతో పక్కా భవనాలు నిర్మించనున్నారు. వీటితోపాటు ఇదే క్యాంపస్‌లో భవిష్యత్తులో సిబ్బంది క్వార్టర్లు, నర్సింగ్ కళాశాల, ఇలా మెడికల్‌కు సంబంధించిన అన్ని అవసరాలకు కావాల్సిన భవనాలను నిర్మించాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

ప్రస్తుతం ఖమ్మం మెడికల్ కళాశాల పాత కలెక్టరేట్‌లోని తాత్కాలిక భవనంలో కొనసాగుతోంది. తొలి బ్యాచ్‌లో 100మంది విద్యార్థులు చేరారు. రెండో ఏడాది అడ్మిషన్లు జరిగితే మరో 100 మంది విద్యార్థులు పెరగనున్నారు. దీనికోసం ఇప్పటికే ఉన్న వసతులను కళాశాల అధికారులు ఎన్ఎంసీకి నివేదించారు. వీటిని నివేదించేందుకు ఉన్న భవనాలను చూపించాల్సి వచ్చింది. మూడు, నాలుగో సంవత్సరానికి విద్యార్థుల సంఖ్య 400కు చేరనుంది. వీరందరికీ తరగతి గదులు, ఆడిటోరియం, హాస్టల్ వసతి, ఆటస్థలం, ఇంకా ఇతరత్రా అవసరాల కోసం ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ పాత భవనం, పరిసరాలు సరిపోయే ఆస్కారం కనిపించడం లేదు. వీటితో పాటు పీజీ తరగతులు కూడా ప్రారంభమైతే ఇక్కడ కళాశాల నిర్వహించడం అసాధ్యం అవుతుంది.

ఈ నేపథ్యంలోనే మెడికల్ కళాశాలకు విశాల స్థలంలో శాశ్వత భవనసముదాయం నిర్మించాలని ఉన్నతాధికారులు తలచారు. దీనికి తోడు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 50 ఏళ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మెడికల్ కళాశాలను తీర్చిదిద్దాలని సూచించిన నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. రఘునాథపాలెం సమీపంలో పక్కా నిర్మాణాలకు కావాల్సిన నిధులు కూడా ఉండడంతో టెండర్ల ప్రక్రియను కూడా చేపట్టనున్నట్లు తెలిసింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ తర్వాత భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిసింది.

మూడో సంవత్సరానికి భవనాలు సిద్ధం

డాక్టర్ రాజేశ్వరరావు, ప్రిన్సిపాల్, ఖమ్మం మెడికల్ కళాశాల

ప్రస్తుతం మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరానికి అడ్మిషన్ల కోసం భవనాలను సిద్ధం చేస్తున్నాం.వీటినే ఎన్ఎంసీకి పంపించాం. మూడో సంవత్సరంలో సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఆప్తాలమిక్, ఫోరెన్సిక్ మెడికల్ విభాగాలు రానున్నాయి. ఈ నేపథ్యంలో మూడో సంవత్సరానికి కొత్త కళాశాల ఆవరణలో పక్కాభవనాలు అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా ప్రణాళికలను రూపొందించాలని ఉన్నతాధికారులకు నివేదించాం. అప్పటికి కనీసం కొన్ని భవనాలైనా సిద్ధమైతే పూర్తిస్థాయిలో మెడికల్ కళాశాలను తరలించి కొత్త భవనాల్లోనే తరగతులను నిర్వహించాలని యోచిస్తున్నాం.

లెక్కతేలిన పట్టభద్రులు

- ఉమ్మడి జిల్లాలో 1,23,497 మంది ఓటర్లు
- తుది జాబితా ప్రకటించిన ఇరు జిల్లాల కలెక్టర్లు

ఖమ్మం కలెక్టరేట్/కొత్తగూడెం(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 4: త్వరలో జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఓటు హక్కు వినియోగించుకునే పట్టభద్రుల ఓటర్ల లెక్క తేలింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,23,497మంది పట్టభద్రులు ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. వీరికోసం ఇరుజిల్లాలో 170 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. తుది ఓటరు జాబితాలను గురువారం ఇరు జిల్లాల కలెక్టర్లు వీపీ గౌతమ్, ప్రియాంక అల విడుదల చేశారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 83,600మంది పట్టభద్రుల ఓటర్లు నమోదయ్యారు. వీరిలో 50,513 మంది పురుషులు, 33,083మంది మహిళా ఓటర్లు, నలుగురు థర్డ్ జెండర్ ఓటర్లు. జిల్లాలో మొత్తం 115పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 39,897 మంది ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. వారిలో పురుషులు 22,485, స్త్రీలు 17,412గా ఉన్నారు. జిల్లాలో 29 ప్రదేశాల్లో 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

ఇరు జిల్లాల్లోని అన్ని మండలాల్లోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఈ ఓటర్ల జాబితాను ప్రదర్శనకు పెట్టారు. గత ఏడాది డిసెంబర్ 30న పట్టభద్రుల ఓటర్ల నమోదుకు నోటిఫికేషన్‌ను వెల్లడించగా ఈ ఏడాది జనవరి 15న తొలిపబ్లికేషన్ విడుదల చేశారు. ఆ తర్వాత జనవరి 25న రెండో పబ్లికేషన్‌ను విడుదల చేశారు. అప్పటినుంచి ఫారం-18 ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. ఫిబ్రవరి 24న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ద్వారా ఓటర్ల జాబితాను వెల్లడించారు. ఫిబ్రవరి 24, మార్చి 14న ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఓటర్ల నమోదుకు దరఖాస్తులను స్వీకరించారు. మార్చి 29వరకు వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి గురువారం తుది జాబితాను ప్రకటించారు. అయితే ఎమ్మెల్సీ నోటిఫికేషన్ ప్రకటించి నామినేషన్ తేదీవరకు అర్హులైన గ్రాడ్యుయేట్లు ఓటరు నమోదుకు అవకాశం ఉందని ఎన్నికల అధికారులు తెలిపారు.

పాలేరుకు జలకళ

- సాగర్ నుంచి 4900 క్యూసెక్కుల నీటి విడుదల
- జలాలను దారి మళ్లించకుండా అధికారుల పర్యవేక్షణ
- ఖమ్మం సహా నాలుగు జిల్లాలకు తొలగనున్న తాగునీటి కష్టాలు

7



ఉమ్మడి జిల్లా వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలగకుండా అధికారులు ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. నీటిపారుదల, మిషన్‌భగీరథ అధికారులు సమన్వయంతో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా తుపాకులగూడెం బ్యారేజీ నుంచి 350క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం దుమ్ము గూడెం వద్ద 48.2 మీటర్ల నీటినిల్వ ఉండటంతో తాగు నీటికి మే మొదటివారం వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని మిషన్‌భగీరథ అధికారులు పేర్కొంటున్నారు.



- మిషన్ భగీరథకు ఆటంకం లేకుండా అధికారుల సమన్వయం
- తుపాకులగూడెం నుంచి 350 క్యూసెక్కుల నీటి విడుదల
- దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద 48.2 మీటర్ల నీటి నిల్వలు

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు

అశ్వాపురం, ఏప్రిల్ 4: ఉమ్మడి జిల్లాలోని పినపాక, అశ్వారావుపేట, కొత్తగూడెం, ఇల్లెందు, సత్తుపల్లి నియోజక వర్గాలకు తాగునీరు అందించేందుకు ప్రభుత్వం 2018లో మండల పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్ట సమీపంలో మిషన్‌భగీరథ ఇన్‌టెక్ వెల్ ను ఏర్పాటుచేసి ఇక్కడ నుంచి మిట్టగూడెం రథంగుట్ట వద్ద నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు నీటిని సరఫరా చేసి అక్కడినుంచి పైపులైను ద్వారా పాల్వంచ మండలం తోగ్గూడెం ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి ఈ రెండు ప్లాంట్‌ల ద్వారా ఉమ్మడిజిల్లాకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే 2019లో ఊహించని విధంగా గోదావరి ఎండిపోవటంతో మిషన్‌భగీరథ నీటిసరఫరా నిలిచిపోవటం అధికారులను విస్మయానికి గురిచేసింది. అప్పటినుంచి వేసవిలో అధికారులు నీటిఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

తుపాకులగూడెం నుంచి 350 క్యూసెక్కులు

గతంలో గోదావరిలో నీటినిల్వలు తగ్గి దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిలభ్యత కష్టంగా ఉన్న సమయంలో మేడిగడ్డ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేసేవారు. కాని మేడిగడ్డ పిల్లర్లు కుంగిపోవటంతో నవంబరు నెలలోనే నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ అధికారులు ప్రత్యామ్నాయంగా రెండురోజుల క్రితం 350 క్యూసెక్కుల నీటిని విడుదల చేయటంతో తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

ఎటువంటి ఇబ్బందులు లేవు: మహేందర్‌రెడ్డి, భగీరథ డీఈ

మిషన్‌భగీరథ తాగునీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులు లేవు. తుపాకులగూడెం ప్రాజెక్ట్‌నుంచి 350క్యూసెక్కులు విడుదల చేయటంతో దుమ్ముగూడెం వద్ద నీటినిల్వలు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం భగీరథ నాలుగు మోటార్లు రన్ అవుతున్నాయి. 45 మీటర్ల వరకు నీటినిల్వలు పడిపోయినా ఇబ్బంది ఉండదు.

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద 48.2 మీటర్ల నిల్వలు

మండల పరిధిలోని కుమ్మరిగూడెం ఆనకట్ట వద్ద ప్రస్తుతం 48.2 మీటర్ల నీటినిల్వలు ఉన్నాయి. దుమ్ముగూడెం ఆనకట్ట ఆధారంగానే మిషన్ భగీరథ ఇన్‌టెక్‌వెల్ నిర్మించారు. గోదావరి వట్టిపోతుండటంతో ఇన్‌టెక్ వెల్ వద్ద నీటినిల్వలు పడిపోతే మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంటుంది. కానీ ప్రస్తుతం ఉన్న నీటి నిల్వలతో వేసవిలో తాగునీటి సరఫరాకు ఢోకా ఉండదని అధికారులు పేర్కొంటున్నారు.

ఐఎన్‌టీయూసీలో వర్గవిభేదాలు

- కమిటీలను మార్చాలంటూ సంతకాల సేకరణ
- సంతకాలు సేకరించేవారికి సభ్యత్వం లేదంటూ మరో వర్గం విమర్శలు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 4: సింగరేణిలో ప్రాతినిధ్య కార్మిక సంఘమైన ఐఎన్‌టీయూసీలో వర్గవిభేదాలు భగ్గుమంటున్నాయి. ఇటీవల జరిగిన సింగరేణి గుర్తింపు కార్మికసంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం కార్పొరేట్, కొత్తగూడెం ఏరియా, ఇల్లెందు, మణుగూరుల్లో విజయం సాధించింది. ప్రాతినిధ్య సంఘంగా ఏర్పడిన ఐఎన్‌టీయూసీలో ఇటీవల ఏర్పాటు చేసిన నూతన కమిటీల్లో వచ్చిన విభేదాలు తారాస్థాయికి చేరాయి. యూనియన్‌లో దీర్ఘకాలంగా పనిచేసిన వారిని పక్కన పెట్టి వలస వచ్చిన వారికి అందలం ఎక్కించారనే విమర్శల నేపథ్యంలో గత రెండు రోజులుగా కొత్తగూడెం కార్పొరేట్‌తోపాటు పలు ప్రాంతాల్లో నూతన కమిటీలను రద్దు చేయాలని సీనియర్ ఐఎన్‌టీయూసీ నాయకులు సంతకాల సేకరణ చేసే పనిలో నిమగ్నమైనట్లు ప్రచారం సాగుతోంది. సింగరేణి గుర్తింపు కార్మికసంఘం ఎన్నికలు నిర్వహించి నాలుగు నెలలు కావస్తున్న గుర్తింపు పత్రం రీజనల్ లేబర్‌కమిషనర్ నుంచి కార్మికసంఘాలకు ఇప్పటివరకు అందకపోయినప్పటికీ ఐఎన్‌టీయూసీ కమిటీ మాత్రం ఏరియా ఉపాధ్యక్షుల నియామకాలను చేపట్టింది. దీంతో గత కొంతకాలంగా ఐఎన్‌టీయూసీలో వర్గవిభేదాలు అంతర్గతంగా కొనసాగుతున్నప్పటికీ గత రెండు రోజులుగా బహిర్గతమవుతున్నాయి. నూతన కమిటీల్లో ఎంపికైన వారు సంతకాలు సేకరించే వారిపై విమర్శలు కురిపిస్తుండగా సీనియర్ నాయకులు పదవులు చేపట్టిన వారిపై విమర్శలు చేస్తున్నారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటుండటంతో కార్మికుల్లో ఐఎన్‌టీయూసీ ప్రతిష్ట మసకబారుతుందనే ప్రచారం సాగుతోంది. ఐఎన్‌టీయూసీ అంతర్గత విభేదాలను పరిష్కరించేందుకు అధిష్టానవర్గం రంగంలోకి దిగుతుందా.. లేదా అనేది తేలాల్సి ఉంది.

క్రమశిక్షణ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం..

ఐఎన్‌టీయూసీ ప్రతిష్టను దిగజార్చేందుకు ఎవరైన ప్రయత్నిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి త్యాగరాజన్ హెచ్చరించారు. గురువారం ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్యత్వం లేని కొందరు డిపార్టుమెంట్లలో తిరుగుతూ సంతకాలు సేకరిస్తున్నారని తెలిపారు. ఐఎన్‌టీయూసీ అధిష్టానవర్గం రాష్ట్రమంత్రుల సూచన మేరకు నూతనకమిటీల ఎంపిక ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షుడు ఎండి. రజాక్, పీతాంబరరావు, యూనియన్ నాయకులు అల్బర్ట్, సునీల్, మహేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు కలగొద్దు

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్ 4: జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ.గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తాగునీటి సరఫరాపై నీటిపారుదల, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్‌శాఖ అధికారులు, ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు రోజు గ్రామాలను సందర్శించాలన్నారు. ప్రజలు, మాజీ ప్రజాప్రతినిధులతో తాగునీటి సమస్యలపై చర్చించి సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగునీటి సరఫరాలో లీకేజీలు అధికారుల దృష్టికి తీసుకొచ్చి వెంటనే నియంత్రించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు మండలస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. మిషన్ భగీరథ నీటిసరఫరా లేని చోట వ్యవసాయ బావులు, స్థానిక నీటి వనరులు అద్దెకు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీలకు చెందిన 600 వాటర్ ట్యాంకర్లు అందుబాటులో ఉన్నాయని, నీటి సరఫరాకు వీటిని అవసరమున్న చోట వినియోగించాలన్నారు. ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు శుభ్రపరచి, క్లోరినేషన్ చేయాలని, తాగునీరు సరఫరాపైనే కాక, శుద్ధమైన, సురక్షితమైన నీటి సరఫరాపై దృష్టి పెట్టాలన్నారు. బోర్లు ఫ్లషింగ్ చేసి, పని చేయని వాటికి మరమ్మతులు చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరాపై ఫిర్యాదు అందిన వెంటనే అధికారులు వెంటనే స్పందించి, పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, నీటిపారుదల సీఈ విద్యాసాగర్, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేందర్, జడ్పీసీఈవో వినోద్, డీపీవో హరికిషన్, ఖమ్మం ఆర్డీవో జి.గణేష్, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.



స్వామి, అమ్మవార్లకు అలంకరించే మాలలతో నృత్యం చేస్తున్న అర్చకులు



గుట్టపైకి వెళ్తున్న భక్తులు

వైభవంగా గుట్ట వేంకటేశుని కల్యాణం

- భారీగా హాజరైన భక్తులు
- పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని

పాల్వంచ టౌన్, ఏప్రిల్ 4: భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణం శ్రీనివాసకాలనీ, శ్రీనివాసగిరి (గుట్ట) వేంకటేశుని కల్యాణం వైభవంగా జరిగింది. గురువారం స్వామివారి కల్యాణాన్ని పురస్కరించుకుని తెల్లవారుఝాము నుంచే ప్రత్యేక అభిషేకాలు, లోక కల్యాణార్థం హోమం నిర్వహించారు. సుమారు 1600మెట్లు ఎక్కి గుట్టపై జరిగే స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. స్వామివారి కల్యాణానికి తహసీల్దార్ వివేక్ ప్రభుత్వ లాంఛనాలతో ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు అదేవిధంగా అయ్యప్పదేవస్థానం నుంచి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారి పాదాల మండపం వద్ద కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ స్వామి, డీఈ మురళీ, ఏఈ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కేవీ.లక్ష్మణరావు, పట్టణ ప్రముఖులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాల్వంచ పట్టణ పోలీసులు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. కాగా భక్తుల గోవిందనామస్మరణతో శ్రీనివాసగిరి పరిసరాలు మారుమోగాయి. పలు ప్రాంతాల నుంచి 40 వేలకు పైగా భక్తులు హాజరయ్యారు. పాదాల మండపం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. భక్తులకు ఎండ వేడిమి తగలకుండా భక్త సమాజమండలి ఆధ్వర్యంలో గుట్టపైన చలువ పందిళ్లు, షామియానాలు ఏర్పాటు చేశారు. ఔషధ తనిఖీ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఖమ్మం జి.ప్రసాద్, కొత్తగూడెం జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భక్త సమాజ మండలి అధ్యక్షుడు ఆరుట్ల లక్ష్మణ్, మండలి సభ్యులు, సేవాదళ్ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి నగేష్ శర్మ, ఆరుట్ల ఫణిరాజాచార్యులు, సౌమిత్రి రామాచార్యులు, హరిచార్యులు మణిదీపాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

జావెలెన్‌త్రోలో కేజీబీవీ విద్యార్థినికి కాంస్య పతకం

పెనుబల్లి, ఏప్రిల్ 4: సౌత్‌జోన్ జాతీయ జావెలెన్‌త్రో పోటీల్లో పెనుబల్లి కేజీబీవీ విద్యార్థిని కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరమణ తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కృష్ణవేణి స్కూల్ నేషనల్ జావెలెన్ త్రోలో 2024 సంవత్సరం పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించిందని వివరించారు. ఈ సందర్భంగా కృష్ణవేణిని ప్రిన్సిపాల్ వెంకటరమణతోపాటు ఉపాధ్యాయులు అభినందించారు.



కృష్ణవేణి

పోలింగ్ కేంద్రాల్లో వాష్ రూమ్‌లు

- విధుల్లో పాల్గొనే మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు
- ఖమ్మం జిల్లాలో తొలిసారి ప్రయోగం

ఖమ్మం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల విధుల్లో ఉండే మహిళ ఉద్యోగులు, పోలింగ్ కేంద్రానికి ఒకరోజు ముందే వెళ్లి పోలింగ్ పూర్తయి ఈవీఎంలు తీసుకెళ్లే వరకు పోలింగ్ కేంద్రాల్లోనే ఉండాల్సి ఉన్నందున వారి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఖమ్మం జిల్లాలో తొలిసారి పోలింగ్ కేంద్రాల ఆవరణలోని ప్రభుత్వ, పాఠశాలలు, కళాశాలలు, ఇతర భవనాల్లో అటాచ్ వాష్ రూమ్‌లు నిర్మిస్తున్నారు. ఒక్కో వాష్ రూమ్‌కు రూ.30వేల ఖరు చేస్తున్నారు.

ఉద్యోగులు ఈవీఎంలు మే 12న మధ్యాహ్నంకే తీసుకెళ్లి పోలింగ్ మే 13న సాయంత్రం 5గంటలకు ముగిసిన తర్వాత ఓటింగ్ లెక్కలు చూసుకుని రాత్రి 8గంటలకు తీసుకుని ఖమ్మంలోని స్ట్రాంగ్‌రూంకు తీసుకు రావాల్సి ఉంటుంది.ఈ లెక్కన సుమారు 35 గంటలకు పైగా పోలింగ్ కేంద్రంలోనే మహిళ ఉద్యోగులు ఉండాలి. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో పోలింగ్ కేంద్రం ఉన్న పాఠశాలలు, కళాశాలలు టాయిలెట్లు ఉన్నా స్నానాల గదులు లేవు. దీంతో మహిళ ఉద్యోగులు పోలింగ్ ముందురోజు సాయంత్రం, పోలింగ్ రోజు ఉదయం స్నానం చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మహిళ ఉద్యోగులు ఖమ్మం కలెక్టర్ గౌతమ్‌కు ఇటీవల తమ సమస్యను విన్నవించారు. పోలింగ్ కేంద్రాలలో స్నానం చేసేందుకు వెసులుబాటు లేదని, ఇబ్బందులు పడాల్సి వస్తోం దని తెలిపారు.

ఈవీఎంలను భద్రత దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల్లోని ఇతరుల ఇళ్లకు వెళ్లి స్నానాలు చేయడం సాధ్యంకాదని, పోలింగ్ కేంద్రంలోనే అటాచ్‌బాత్‌రూంలు ఏర్పాటు చేయాలని కోరడంతో కలెక్టర్ మహిళ ఉద్యోగుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని లోకాస్ట్‌లో ఒకే బాత్‌రూం లో స్నానాలతోపాటు అటాచ్‌బాత్‌రూం రూ.30వేల ఖర్చుతో డిజైన్ చేయించి జిల్లాలో 700 పోలింగ్ స్టేషన్లలో 360లోకాస్ట్ టాయిలెట్లు మంజూరు చేయించి నిర్మాణం చేపట్టారు. ఈనెల 10లోగా వీటి నిర్మాణం పూర్తికాబోతుంది. ఈ బాత్‌రూంలకు మిషన్ భగీరథ ద్వారా నీటిని నేరుగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అటాచ్ బాత్‌రూంలు ఏర్పాటు చేయడంతో పోలింగ్ విధుల్లో సిబ్బందికి పోలింగ్ అనంతరం ఆయా పాఠశాలలు, కళాశాలల్లో ఉండే ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులు, లెక్చరర్లు ఇతర సిబ్బందికి సైతం ఇవి ఉపయోగపడతాయని, అందు వల్ల స్కూల్ గ్రాంట్ నిధుల నుంచి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంజిల్లాలో మోడల్‌గా నిర్మిస్తున్నామని కలెక్టర్ గౌతమ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల విధుల్లో ఉన్న మహిళ ఉద్యోగులు స్నానాలు గది లేకపోవడ తో కొంతఇబ్బందిఎదుర్కోవాల్సి వచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు.

'తుక్కు' తుక్కుగా దోచుకున్నారు..



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

- కేటీపీఎస్ పాత ప్లాంట్ కూల్చివేత టెండర్లలో గోల్‌మాల్
- లోపాయికారిగా సహకరించిన జెన్‌కో ఉన్నతాధికారులు
- విజిలెన్స్, ఏసీబీతో సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- బీజేపీ, బీఎస్పీ నాయకుల డిమాండ్

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేత టెండర్, స్క్రాప్ తరలింపులో చోటుచేసుకుంటున్న అవినీతి అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్, ఏసీబీ విచారణకు ఆదేశించాలని బీజేపీ నాయకుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ ఓఅండ్ఎం ప్లాంట్ కూల్చివేత టెండర్‌ను రూ. 485 కోట్లకు ముంబైకి చెందిన హెచ్‌ఆర్ కంపెనీ దక్కించుకుందని, వాస్తవానికి స్క్రాప్ విలువ రూ.850 నుంచి రూ.900 కోట్ల వరకు ఉంటుందన్నారు. హెచ్‌ఆర్ కంపెనీతో జెన్‌కో ఉన్నతాధికారులు కుమ్మక్కై తక్కువ రేటుకు కట్టబెట్టారని ఆరోపించారు.

టెండర్‌లో కూల్చివేత భూమి లెవల్ వరకు చేయాలని ఉంటే ప్లాంటులో పునాదులతో సహా తొలగించారని, యాష్ ప్లాంట్ పైపులు వెలికి తీశారని, ఇలా సుమారు రూ.100కోట్ల అవినీతి జరిగిందన్నారు. ఎస్‌పీఎఫ్ పర్యవేక్షణలో ఉండాల్సిన ప్లాంటును కంపెనీ సొంత సెక్యూరిటీ పెట్టుకొని స్క్రాప్‌ను తరలిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. కూల్చివేత ప్రక్రియలో స్థానికులకు ఉపాధికల్పించకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తేవడం ఏమిటని ఆయన ప్రశ్నించారు.

స్థానిక కూలీలను ఏర్పాటు చేస్తే అక్రమాలు బయటకు వస్తాయని హెచ్‌ఆర్ కంపెనీ ఈ చర్యకు పాల్పడిందన్నారు. స్క్రాప్ లారీలు ఉదయం పూట కాకుండా రాత్రివేళలో తరలించడం ఏమిటన్నారు. హెచ్‌ఆర్ కంపెనీ కంటెరా స్టీల్స్ పేరుతో స్థానికంగా ఇంకో కంపెనీ ప్రారంభించి అక్రమ మార్గంలో జీఎస్టీ ఎగవేసి స్క్రాప్ తరలిస్తుందని అనుమానం వ్యక్తం చేశారు. జీఎస్టీ అధికారుల హెచ్‌ఆర్ కంపెనీ మీద విచారణ చేసి అక్రమాలను నివృత్తిచేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ఓ డైరెక్టర్ కుమారుడి వివాహం ఘనంగా జరిగిందని, దాని మొత్తం ఖర్చు హెచ్‌ఆర్ కంపెనీ భరించిందని ఆరోపించారు. తక్షణమే పాతప్లాంట్ కూల్చివేత టెండర్లు, కూల్చివేత పనులపై సమగ్ర విచారణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఈసమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలచెర్వు శ్రీనివాస్, జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు రాపాక రమేష్, గంధం ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్: కేటీపీఎస్‌లోని పాత ప్లాంట్ టెండర్ల కూల్చివేత పనులపై సమగ్ర విచారణ జరిపించాలని, అధికారుల పాత్రపై ఏసీబీ విచారణ జరిపించాలని బహుజన్ సమాజ్‌పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో తుక్కు కోసం టెండర్ దక్కించుకున్న ముంబైకి చెందిన హెచ్‌ఆర్ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ప్లాంట్ తొలగింపు పనుల్లో భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. టెండర్ నిబంధన ప్రకారం ప్లాంట్‌లో ఉన్న స్థలంలోని తవ్వకాలు జరిపి తుక్కును తరలించాల్సి ఉండగా ఇష్టారీతిన సామాగ్రిని తరలించిందని ధ్వజమెత్తారు.

చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘా: కలెక్టర్ గౌతమ్

కల్లూరు, ఏప్రిల్ 4: చెక్‌పోస్టుల వద్ద పటిష్ట నిఘా చర్యలు చేపట్టి నగదు, మద్యం రవాణాను నియంత్రించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం పోలీసు కమీషనర్ సునీల్‌దత్‌తో కలిసి కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామం వద్ద ఏర్పాటు చేసిన(తెలంగాణ-ఏపీ సరిహద్దు) చెక్‌పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది విధులు నిర్వహణ, ఎన్ని వాహనాలు తనిఖీ చేసింది వివరాలు అడిగి తెల సుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. నగదు, మద్యం రవాణా నియంత్రిం చాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేయాలన్నా రు. వాహనాల తనిఖీ సంబంధించి రిజిస్టర్‌ను నిర్వహించాలన్నారు. చెక్‌పోస్ట్‌లో వీడిమోగ్రఫీకి చర్యలు తీసుకోవాలని మండల ఎన్నికల అధికారులను కోరారు. 24 గంటలు పటిష్ట నిఘా పెట్టాలని సూచించారు. అంతకు ముందు మండలంలోని హనుమతాండ, కలా లి వాడ, పేరువంచ, ముగ్గువెంకటాపురం గ్రామా ల్లోని పోలింగ్ కేంద్రాలను కూడా పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మర గు దొడ్లు వంటి తదితర మౌలిక సదుపాయాలు ఉం డేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూ దన్ నాయక్ సింగ్, యువరాజ్, శిక్షణ ఐపీఎస్ మౌనిక, మిషన్ భగీరథ ఈఈ పుష్పలత, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.



చెక్‌పోస్టు వద్ద కలెక్టర్, సీపీ

కుమార్తె వివాహం రోజే..

- ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తల్లిదండ్రులకు ప్రమాదం
- తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలు

కొణిజర్ల, ఏప్రిల్ 4: కూతురు వివాహానికి ద్విచక్ర వాహనంపె వెళ్తూ చెట్టును ఢీకొని భార్యాభర్తలు తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం ఉదయం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలో జరిగింది. కొణిజర్ల ఎస్ఐ శంకర్‌రావు, స్థానికుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం గ్రామానికి చెందిన ఏదులపురం సైదులు, మంగ దంపతుల కుమార్తె రమ్య వివాహం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బొడ్డుపల్లి ఉపేందర్, నాగమణి దంపతుల పెద్దకుమారుడు నరేందర్‌తో కుదుర్చుకున్నారు.

గురువారం ఉదయం 9.10 గంటలకు వివాహ ముహూర్తం ఉండటంతో సైదులు, మంగ దంపతులు కుమార్తెను ముందుగానే వాహనంలో కల్యాణ వేదిక వద్దకు పంపించి వారు ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ఈ క్రమంలో తనికెళ్ల సమీపంలోకి రాగానే వారి బైక్ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలకు తల భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 ద్వా రా ముందుగా ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకరావు తెలిపారు. తల్లిదండ్రులకు ప్రమాదం జరిగినా వివాహ ముహూర్తం తప్పకూడదనే ఉద్దేశంతో బంధువులు వారి రమ్య వివాహాన్ని జరిపించారు. కన్న కూతురు వివాహ వేడుకల్లో ఆనదంగా పాల్గొనాల్సిన వేళ.. సైదులు దంపతులు ఆస్పత్రి పాలు కావడం అందరినీ చలింపచేసింది.



ప్రమాద ఘటన స్థలం

ఆదివాసులకు వేసవి రక్షణ చర్యలు చేపట్టాలి

- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక
- గొత్తికోయల గ్రామాల్లో పర్యటన

చుంచుపల్లి, ఏప్రిల్ 4: ఏజెన్సీ ఆదివాసులకు వేసవి రక్షణ చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ ప్రియాంక అలా తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ప్రియాంక అలా గురువారం చుంచుపల్లి మండలంలోని పెనగడప పంచాయతీ పరిధిలోని గొత్తికోయల గ్రామాలను సందర్శించారు. జగ్గారం, మర్రిగూడెం, పాలవాగు, గడ్డిగుప్ప, గొత్తికోయ గ్రామాలలో తాగునీటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక గిరిజనులతో మాట్లాడారు. తాగునీటి గురించి ఆరా తీశారు. ప్రభుత్వపరంగా వారికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు గ్రామస్థుల ఆరోగ్య సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. అనంతరం పించన్లపై కలెక్టర్ ఆరా తీశారు. అర్హులైన అందరూ ఎన్నికల అనంతరం పించన్‌కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. తాగునీటి సమస్యల పరిష్కారాని కి అవసరమైన చర్యలన్నింటిని తీసుకుంటామని కలెక్టర్ గిరిజనులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో విద్యాచందన, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, డీఈఈ శివయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ వసంత, చుంచుపల్లి తహసీల్దార్ పి.కృష్ణ, ఎంపీడీవో అశోక్‌కుమార్, ఎంపీవో గుంటి సత్యనారాయణ పాల్గొన్నారు.



గొత్తికోయలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక



హాజరైన గిరిజనులు

పోలింగ్ సిబ్బంది ఓటేయడం ఇక ఈజీ..

- ఈడీ సర్టిఫికెట్ ద్వారా ఈవీఎంలోనే ఓటు వేసే అవకాశం
- కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చిన ఎన్నికల సంఘం
- ఉద్యోగుల ఓటింగ్ భారీగా పెరిగే అవకాశం
- లోక్‌సభ ఎన్నికలు మాత్రమే జరిగే రాష్ట్రాలకే వర్తింపు

ఖమ్మం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ రాష్ట్రంలో కొత్త మార్పు తెచ్చింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఉమ్మడిగా జరిగే రాష్ట్రాల్లో ఈ మార్పు ఉండదు. లోక్‌సభ ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మాత్రమే విధుల్లో ఉండే ఉద్యోగులు, అధికారులు, పోలీసులు పోస్టల్ బ్యాలెట్ లేకుండా నేరుగా ఈవీఎంల ద్వారానే తమ లోక్‌సభ అభ్యర్థికి ఓటువేసే సౌలభ్యం కలగబోతుంది.

ఇందుకోసం ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు జిల్లా కలెక్టర్‌కు ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తులో తన నివాసం, ఓటరు జాబితాలో పేరు, ఓటరు నెంబర్, వివరాలన్ని తెలియచేయాలి. దరఖాస్తును పరిశీలించి ఉద్యోగి లోక్‌సభ నియోజకవర్గంలో ఏ పోలింగ్ కేంద్రానికి డ్యూటీకి వెళుతున్నారో అక్కడ పోలింగ్ ఆఫీసర్‌కు ఈడీ సర్టిఫికెట్ జారీచేస్తారు. ఆ సర్టిఫికెట్‌లో విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగికి ఏగ్రామంలో, పట్టణంలో ఓటు ఉందో ఆ ఓటరు జాబితా సీరియల్ నెంబర్‌తో ఈడీ ధ్రువీకరణ పత్రం ఇస్తున్నందున పోలింగ్ రోజున అక్కడ విధుల్లో ఉండే పోలీసులు, ఎన్నికల సిబ్బంది ఈడీ సర్టిఫికెట్లు పోలింగ్ ఆఫీసర్‌కు సమర్పించి అక్కడ ఓటరు జాబితాలో ఈడీ సర్టిఫికెట్లు ఉన్న ఉద్యోగుల పేరు ఓటరు వివరాలు రాసి ఈవీఎంలోనే నేరుగా ఓటు వేసుకునే సదుపాయం కల్పిస్తున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే వారు ఒక అసెంబ్లీ నియోజకవర్గం నుంచి మరొక అసెంబ్లీ నియోజకవర్గానికి వెళ్లబోతు న్నందున ఆ నియోజకవర్గం కూడా లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోనే ఉంటుంది. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, పోలీసులు, ఇతర సిబ్బందికి మాత్రమే ఈవీఎంలలోనే ఓటు వేసుకునే అవకాశం కల్పిస్తున్నారు. వేరే లోక్‌సభ నియోజకవర్గంలో ఓటరుగా ఉంటే ముందుగానే రిటర్నింగ్ అధికా రికి దరఖాస్తు చేస్తే అతడికి మాత్రం పోస్టల్ ఓటు మంజూరవు తుంది. పోలింగ్‌కు ముందే వెళ్లి పోస్టల్ ఓటు వేసి రావల్సి ఉంటుంది. ఎన్నికల కమిషన్ ఈసారి ప్రభుత్వ ఉద్యోగులకు, లోక్ సభ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికలు నిర్వహించే వారందరికి ఈ సదు పాయం కలిపించిందని ఖమ్మం జిల్లా ఎన్నికల అధికారి, ఖమ్మం లోక్‌స భ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ తెలిపారు దీనివల్ల పోస్టల్ బ్యాలెట్లు పెద్దగా వినియోగించుకునే అవకాశం ఉండదని తెలిపారు.

మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

● నామా నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న నామా నాగేశ్వరరావు

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 4: ప్రజలకు మాయమాటలు చెప్పి, అమలు చేయని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పథకాల అమలులో పూర్తిగా విఫలమైందని ఎంపీ నామా నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఊట్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్ వంద రోజుల్లోనే పూర్తిగా విఫలం చెందిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల ఎకరాల పంటలు ఎండిపోతున్నాయన్నారు. బోర్లు కూడా పనిచేయని దుస్థితి నెలకొందని, అయినా రైతాంగాన్ని ఆదుకోవటానికి ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు అఖండ మెజార్టీతో విజయం సాధిస్తారని, అందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని కోరారు. అనంతరం మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బిర్రం వెంకటేశ్వరరావును ఎంపీ నామా నాగేశ్వరరావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి, జడ్పీటీసీ వరలక్ష్మి, సున్నం నాగమణి, ప్రకాశరావు, వగ్గెల పూజ, ఫణీంద్ర, రమణారావు, మోహనరెడ్డి, సంపూర్ణ, కాసాని చంద్రమోహన్, సూర్యనారాయణ, మారుతి లలిత, చందా లక్ష్మీనర్సయ్య, మోహన్, నారం రాజశేఖర్, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ


మజ్జిగ ప్యాకెట్ అందిస్తున్న పీవో నరసింహారావు

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్4: వేసవి ఎద్దడి దృష్ట్యా సింగరేణి ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్ని కిష్టారం ఓసీలో పీవో ఎం.వీ.నరసింహారావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75రోజుల పాటు ఉద్యోగులకు మజ్జిగను పంపిణీ చేయను న్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమంలో సంస్థ రాజీలేకుండా అన్నీ సమకూరుస్తుందన్నారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించి, సంస్థ అభివృద్ధి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలరీ మేనేజర్ రామకృష్ణ, సంక్షేమాధికారి విజయ సందీప్, ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీల నిర్వహణ

గుదిబండేనా..?

- కనీసం 50 మీటర్ల రా మెటీరియల్ స్టాక్ ఉంటేనే పర్మిట్లు
- పర్యావరణ అనుమతి ఆంక్షలతో తగ్గిన లీజులు



ఖమ్మం ఖానాపురం హవేలి మార్చి ఏప్రిల్ 4: గ్రానైట్ క్వారీలపై ప్రభుత్వ ఆంక్షలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఏప్రిల్ ఒకటి నుంచి తెలంగాణ ప్రభుత్వం క్వారీలపై మరో ఆంక్షను తెరపైకి తీసుకొచ్చింది. ప్రభుత్వ అనుమతులు ఉన్న అన్ని క్వారీలలో పర్మిట్లు కావాలంటే క్వారీలలో 50 మీటర్ల స్టాక్ అమ్మకానికి సిద్ధంగా ఉంటేనే ఆన్‌లైన్ పర్మిట్‌కు ఇచ్చేందుకు వీలుగా సాఫ్ట్‌వేర్ మార్చినట్లు తెలిసింది. దీంతో ఖమ్మం జిల్లాలో ఉన్న సుమారు 40 క్వారీలలో ఈ పద్ధతితో 10 క్వారీలు కూడా నడిచే పరిస్థితి లేదు. కారణం నెల మొత్తం పని చేసినా 50 మీటర్లు రాని క్వారీలలో పర్మిట్లు ఎలా తీసుకోవాలో అధికారులకే తెలియాలని పేర్కొంటున్నారు. ఏదో 5,6 క్వారీలలో నెలకు సుమారు 200 మీటర్లు వస్తే వాళ్లకు ఈ పద్ధతి ఉపయోగకరంగా ఉంటుంది.

కాని తెలంగాణలోని అన్ని జిల్లాలో ఇదే పద్ధతి అవలంభిస్తే తెలంగాణా వ్యాప్తంగా అన్ని జిల్లాలోని క్వారీల కంటే ఖమ్మం జిల్లాలోని బ్లాక్ గ్రానైట్ క్వారీల పరిస్థితి దారుణంగా ఉంటుంది. నెలకు 30 నుంచి 40 మీటర్లు వచ్చే క్వారీలే అధికంగా ఉన్నాయి. దీంతో ఈ క్వారీలకు ఆన్‌లైన్ పర్మిట్లు ఎలా దరఖాస్తు చేయాలో, క్వారీలో రా మెటీరియల్ ఎలా అమ్మాలో తెలియని పరిస్థితి.

2000వ సంవత్సరానికి ముందు ఖమ్మం జిల్లాలో 200కు పైగా క్వారీలు ఉండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 40కి చేరుకుంది. ప్రభుత్వ ఆధీనంలో 166.43 హెక్టార్ల భూమిలో 148,929 హెక్టార్ల పట్టాదారు (ప్రైవేటు)భూములో క్వారీలు నడిచేవి. మెత్తం 315.361 హెక్టార్లలో క్వారీలు నడిచేవి. ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో కలిపి 100 హెక్టార్లలో మాత్రమే గ్రానైట్ లీజులు నడుస్తున్నాయి. 215 హెక్టార్లలో తవ్వకాలు పూర్తిగా తగ్గిపోయాయంటే ప్రభుత్వాల నిర్ణయాలే కారణంగా చెప్పవచ్చు.

క్వారీ లీజులు రద్దు

గ్రానైట్ క్వారీలకు అనుమతులు ఇచ్చిన స్థలాల్లో ప్రభుత్వం ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు, పేదలకు ఇళ్ల నిర్మాణాలకు స్థలాలు, వివిధ ప్రభుత్వ భవనాలకు ఈ భూములను కేటాయించిన కారణంగా వందల సంఖ్యలో క్వారీలకు అనుమతులు రద్దు చేసింది. క్వారీల నిర్వహణకు అన్ని అనుమతుల తోపాటు పర్యావరణ అనుమతులు తప్పని సరి చేస్తూ జీవోలు తీసుకురావడంతో క్వారీ లీజులు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. గతంలో క్వారీ లీజులకు పర్యావరణ అనుమతి లేకుండానే లీజులు మంజూరు చేసేవారు. ప్రస్తుతం ప్రతి గ్రానైట్ క్వారీ లీజుతోపాలు, గ్రావెల్, స్టోన్‌మెటల్ క్వారీలకు పర్యావరణ అనుమతులు తప్పని సరి చేయడంతో జిల్లాలో గ్రానైట్ తవ్వకాలు తగ్గిపోయి, ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి గ్రానైట్ బ్లాక్‌లకు కొనుగోలు చేయవల్సిన పరిస్థితి ఏర్పడింది.

వాస్తవానికి ఖమ్మం జిల్లాలో గ్రానైట్ నిల్వలు అధికంగానే ఉన్నా ప్రభుత్వ నిర్ణయాలతో అవి బయటకు తీసే పరిస్థితులు లేకపోవడంతో, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్రానికి ఆదాయం తగ్గుతుంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లాకు ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి అధికంగా గ్రానైట్ బ్లాక్‌లు కొనుగోలు చేస్తున్నారు. అక్కడి ప్రభుత్వాలు గ్రానైట్ లీజుల అనుమతులపై సానుకులంగా ఉండటంతో క్వారీల అనుమతులు కూడా సులభంగా వస్తున్నాయి.

బ్లాక్ గ్రానైట్ ఉత్పత్తిలో ఖమ్మం జిల్లా అగ్రస్థానం

బ్లాక్ గ్రానైట్ ఉత్పత్తులో ఖమ్మం జిల్లా ఉమ్మడి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉండేది. అలాంటిది రాష్ట్ర విభజన తర్వాత మరింత ముందుకెళ్తున్నది అనుకుంటే రోజు రోజుకు పరిశ్రమల మనుగడ దిగజారుతుంది. ఖమ్మం జిల్లాలోని బ్లాక్ గ్రానైట్ ఉత్పత్తులు ప్రపంచ వ్యాప్తంగా పేరొందాయి. అలాంటిది ప్రస్తుత పరిస్థితుల ప్రభావంగా పరిశ్రమల మనుగడ కష్టంగా మారిందని పలువురు పరిశ్రల యజమానులు వాపోతున్నారు. జిల్లాలో మొత్తం 600 వందల వరకు స్లాబ్ పరిశ్రమలు, 250 వరకు టైల్స్ పరిశ్రమలతో కళకళలాడుతూ ఎందరో కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్నాయి. అలాంటిది ప్రస్తుతం జిల్లాలో 350 స్లాబ్ పరిశ్రమలు 80 టైల్స్ పరిశ్రమలు నడుస్తున్నాయి. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 50 మీటర్ల ఉంటేనే పర్మిట్లు అన్న పద్ధతితో చిన్న చిన్న క్వారీలు మూత పడటం ఖాయం కావడంతో పరిశ్రమలకు ముడి సరుకు అందక మరికొన్ని పరిశ్రమలు మూతపడే అవకాశాలు కానవస్తున్నాయి.

ఖమ్మంలో ఐడీటీఆర్ సెంటర్ ఏర్పాటు

● జిల్లా రవాణా శాఖాధికారి అఫ్రిన్ సిద్ధిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న డీటీవో అఫ్రిన్‌సిద్దిఖీ

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్4: ఖమ్మం జిల్లా కేంద్రంలో రాజన్న సిరిసిల్లా జిల్లా తరహాలోనే ఐడీటీఆర్ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ట్రాఫిక్ రీసెర్స్ సెంటర్) కేంద్రాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా రవాణా శాఖాధికారి అఫ్రిన్ సిద్దిఖీ తెలిపారు. గురువారం సత్తుపల్లిలో యూ నిట్ రవాణా శాఖ కార్యాలయ భవన నిర్మాణం కోసం తహసీల్దార్ యోగేశ్వరరావుతో కలిసి స్థానిక విరాట్ నగర్‌లోని బ్రహ్మంగారి గుడి సమీపంలో గల సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సత్తుపల్లి ఎంవీఐ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట సత్తుపల్లి ఎంవీఐ యోగేశ్వర్ జాదవ్ ఉన్నారు.

పెనుబల్లి: అంతర్రాష్ట్ర సరిహద్దు పెనుబల్లి మండలం ముత్తగూడెం వద్దనున్న రవాణాశాఖ చెక్‌పోస్టును జిల్లా రవాణాశాఖ అధికారి అఫ్రిన్ సిద్దిఖీ గురువారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ పరీక్షలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 4: జేఈఈ మెయిన్స్ రెండో విడత పరీక్షలు గురువారం ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా కోఆర్డినేటర్ పార్వతీరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆరు పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1072 మందికి గాను 1000 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే చర్యలు

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 4: వేసవి సెలవుల్లో క్లాసులు నిర్వహిస్తే చర్యలు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు జూనియర్ కాలేజీలు అడ్మిషన్లు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గుర్తింపు లేని కాలేజీల్లో చేర్పించొద్దని తెలిపారు.

'సాంకేతికతను అందిపుచ్చుకోవాలి'


వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల

వైరా, ఏప్రిల్ 4: వ్యవసాయంలో నూతన సాంకేతికత పద్ధతులను పాటించటం ద్వారా అధిక ఉత్పత్తులు సాధించవచ్చునని అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల డీన్ డాక్టర్ జె.హేమంతకుమార్, ఖమ్మం జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల పేర్కొన్నారు. వైరాలోని కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రైతు సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి రమణ, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు డాక్టర్ వేణుమనోహర్, టి.భరత్, ఆర్‌ఈఏసీ సభ్యుడు తుమ్మల రాణాప్రతాప్, వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు కృష్ణతేజ, రెడ్డి ప్రియా, కేవీకే శాస్త్రవేత్తలు జెస్సీ సునీత, రవి, పణిశ్రీ పాల్గొన్నారు.

టెట్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి

● టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవి

పాల్వంచ, ఏప్రిల్4: ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌ను ఎవరు రాయాలి అనే విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా రవి ప్రభుత్వాన్ని కోరారు. గురువారం పాల్వంచ పట్టణ పరిధిలోని పాత పాల్వంచ, కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన యూనియన్ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు రాజు, మల్లెంపాటి వెంకటేశ్వర్లు, యాకూబ్‌పాషా, నరసింహారావు, శ్రీనివాసరావు, మోహన్‌రావు, బాలు, పద్మలత, కుమారి పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు సహకరించాలి

- అంతరాష్ట్ర సరిహద్దు సమావేశంలో కలెక్టర్ వీపీ గౌతమ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్, ఏప్రిల్4: స్వేచ్ఛాయుతంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్ ఆకాంక్షించారు. గురువారం ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, రాజుపేట శ్రీరస్తు కన్వెన్షన్ సెంటర్‌లో తెలంగాణ ఖమ్మం జిల్లా, ఆంధ్రప్రదేశ్ ఎన్టీఆర్ జిల్లాల అంతర్రాష్ట్ర సరిహద్దుల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతర్రాష్ట్ర సరిహద్దు వెంబడి ప్రత్యేక చెక్‌పోస్టులతో నిఘాను పటిష్టం చేసినట్లు తెలిపారు. నగదు, మద్యం, గంజాయి, విలువైన వస్తువులు తదితరాల అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకున్న చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ఈసీఐ ఎథికల్ ఓటింగ్‌తో పాటు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేందుకు వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఏఎస్డీ జాబితాను గమనించాలని, ఓటును బదిలీకి ఈ నెల 14 వరకు సమయమున్నట్లు, దీనిపట్ల అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు.

సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ చెక్‌పోస్టుల వద్ద నిఘాను కట్టుదిట్టం చేసినట్లు వివరించారు. రెండు జిల్లాల ఉన్నతాధికారులు, నోడల్ అధికారులు ఇదేవిధమైన సహకారాన్ని ఎన్నికలు ముగిసేవరకు కొనసాగించనున్నట్లు తెలిపారు. అనంతరం విజయవాడ పోలీస్ కమిషనర్ కాంతిరాణా టాటా మాట్లాడుతూ, సరిహద్దు గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. సరిహద్దుల్లో నిఘా విషయంలో రెండు జిల్లాల మధ్య సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. స్థానిక అధికారుల సహకారంతో అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. డబ్బు, మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణాను నిలువరించేందుకు ప్రధాన రహదారులతో పాటు డొంక రూట్ల పైనా దృష్టి సారిస్తున్నట్లు ఖమ్మం సీపీ అన్నారు. సరిహద్దులో నిఘా విషయంలో రెండు జిల్లాల మధ్య సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, రెండు జిల్లాల పోలీస్, రెవెన్యూ, రవాణా, సహకార, బ్యాంకింగ్, శాఖల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

డయల్ 100కు 4,205 కాల్స్

ఖమ్మంక్రైం,ఏప్రిల్ 4: సమాజంలో పెరిగిపోయిన నేర ప్రవృత్తి నేపథ్యంలో ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణే ధ్యేయంగా ఏర్పాటైన డయల్ 100కు మార్చి నెలలో 4,205 కాల్స్ వచ్చాయని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 100కు వచ్చిన కాల్స్‌పై విచారణ జరిపి 75 కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. వీటిలో మహిళలపై వేధింపులు-4, దొంగతనాలు-10, సాధారణ ఘాతాలు-22, యాక్సిడెంట్లు -13, అనుమానస్పద మరణాలు-4, ఇతర కేసులు-22 వచ్చాయని సీపీ తెలిపారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 4: పట్టణంలోని బస్టాండ్ కాంప్లెక్స్‌లో గల ఎంఎస్ మొబైల్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. దుకాణం పైభాగంలోని రేకులను తొలిగించి లోపలికి చొరబడిన వ్యక్తులు ఫోన్లు, నగదు, సామాగ్రిని చోరీ చేశారు. దుకాణ యజమాని మౌలీ గురువారం ఉదయం దుకాణం తెరిచి చూడగా రేకులు తొలిగించి సీలింగ్‌కు రంధ్రం పెట్టి ఉండటంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ అయిన వస్తువుల విలువ రూ.80 వేల వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

నాలుగు కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మోతుక్కారుకు చెందిన ఇక్కిరి భాస్కర్, పెరుమాండ్ల శ్రవణ్‌కుమార్ల బ్యాగులను తనిఖీ చేయగా, నాలుగు కిలోల గంజాయి ఉండడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. చింతూరు సమీపం నుంచి గంజాయిని తీసుకొని వెళ్తున్నట్లు విచారణలో వెల్లడించారని తెలిపారు. రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని, వారిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గీత కార్మికుడికి పాముకాటు

● రక్షించిన వైద్య సిబ్బంది

నేలకొండపల్లి ఏప్రిల్ 4: తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్తున్న గీత కార్మికుడిని పాము కాటువేసిన సంఘటన మండలంలోని ఆరెగూడెంలో జరిగింది. గ్రామానికి చెందిన పూదారి సీతారాములు వృత్తిరీత్యా గీతకార్మికుడు. గురువారం గీత వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కేందుకు వెళ్తుండగా అతడిని పాము కాటువేసింది. పాము విషం తీవ్రత అధికంగా ఉండటంతో అతడు అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అతడిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్య సిబ్బంది అతడిని ప్రాణప్రాయం నుంచి కాపాడారు.

నివాస గృహాన్ని కుల్చివేసిన అగంతకులు

ఇల్లెందు, ఏప్రిల్4: ఇల్లెందు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలోని గురువారం గుర్తు తెలియని అగంతకులు పూజారి వేణుమాధవ్ నివాస గృహాన్ని కుల్చివేశారు. ఇంట్లో నిద్రిస్తున్న అతనితో పాటు కుటుంబ సభ్యులను బెదిరించి, విద్యుత్ కలెక్షన్ తొలగించి సెల్‌ఫోన్లను తీసుకొని ఇంటిని కుల్చివేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత 20 ఏళ్లుగా నివాసం ఉంటున్న తనను ఇంటి నుంచి వెళ్లగొట్టి తన నివాస గృహాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, వారి ప్రోద్బలంతోనే గురువారం గుర్తు తెలియని దుండగులు బెదిరించి తాను నివాసం ఉంటున్న ఇల్లు కుల్చారని తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపాడు.

పాలేరుకు జలకళ

- నాగార్జున సాగర్ నుంచి 4900 క్యూసెక్కుల నీటి విడుదల
- నాలుగు జిల్లాలకు తొలగనున్న తాగునీటి కష్టాలు


నీటిరాకను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

కూసుమంచి, ఏప్రిల్ 4: ఎట్టకేలకు నాగార్జున సాగర్ జలాలు పాలేరు చేరుకున్నాయి. డ్యామ్‌నుంచి ఈనెల ఒకటో తేదీన సాయంత్రం 6గంటలకు 4900 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా గురువారం ఉదయం ఆరుగంటలకు పాలేరు జలాశయం చేరుకున్నాయి. ప్రస్తుతం మూడువేల క్యూసెక్కుల నీరు జలాశయానికి చేరుతుండగా నీటిమట్టం స్వల్పంగా చేరుతోంది. గత 10 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా పాలేరు జలాశయం 6అడుగులకు పడిపోయింది. దీంతో ఉమ్మడి ఖమ్మంజిల్లాతోపాటు, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట జిల్లాలకు తీవ్ర తాగునీటి ఎద్దడి ఏర్పడగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో నీరందించారు. ఈక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమస్యను ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. మూడు నెలల పాటు నీరు అవసరం ఉంటుందని మూడు టీఎంసీల నీరు అ వసరం ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే సాగర్ జలాలు విడుదల చేయాలని ఆదేశాలు జారీచేశారు. రెండు టీఎంసీల నీరు కేటాయించగా ఎగువన ఉన్న పెద్దదేవులపల్లి, పానుగోడు రిజర్వాయర్లు సైతం ఎండిపోవడంతో వాటిని మొదట నింపారు. అనంతరం గురువారం ఉదయం పాలేరు చేరుకున్నాయి. దీంతో 5.6 అడుగులు ఉన్న నీటిమట్టం సాయంత్రానికి 6.4 అడుగులకు పెరిగింది. ఇబ్బందులు తొలగనున్నాయి.

అధికారుల పర్యవేక్షణ

పాలేరు జలాశయానికి తాగునీటిని విడుదల చేయగా ఆయకట్టు రైతులు దుర్వినియోగం చేయకుండా ఎడమకాల్వపై అధికారుల నిఘా ఏర్పాటుచేశారు. సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు చెందిన నీటిపారుదల, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారులు కాల్వపై తిరుగుతున్నారు. గేట్లు ఎత్తకుండా చూస్తున్నారు. అదే విధంగా రైతులు నీటిని పంటలకు ఉపయోగించకుండా ఎడమకాల్వపై, జలాశయం చుట్టూ అనధికారికంగా ఉన్న విద్యుత్ మోటార్లను విద్యుత్ అధికారులు తొలగిస్తున్నారు. కాగా, పాలేరుకు సాగర్ జలాలు చేరుకోవడంతో నీటిపారుదల, భగీరధ, విద్యుత్‌శాఖల అధికారులు పరిశీలించారు. ఖమ్మం ఆర్డీవో గణేష్, భగీరధ సిఈ శ్రీనివాస్, ఈఈ వాణిశ్రీ, మురళీకృష్ణ, ఐబీ ఈఈ మంగళపూడి వెంకటేశ్వరరావు,డిఈలు మన్మధరావు, రత్నకుమారి, ఇంకా విద్యుత్‌శాఖ అధికారులు పరిశీలించారు. నీటిని దుర్వినియోగం కాకుండా చూడాలని కిందిస్థాయిసిబ్బందిని ఆదేశించారు.

నేడు మున్నేరుకు సాగర్ జలాలు

ఖమ్మం నగరవాసులకు తాగునీటి అవాంతరాలు తీర్చేందుకు పాలేరు జలాశయం నుంచి శుక్రవారం సాగర్ జలాలు విడుదల చేయనున్నారు. 24గంటల పాటు 500 క్యూసెక్కులనీటిని విడుదల చేయనున్నట్లు ఐబీ అధికారులు తెలిపారు.

శబ్దాలు కలిగించే సైలెన్సర్లు అమరిస్తే చర్యలు

● ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

ఖమ్మంక్రైం, ఏప్రిల్4: ద్విచక్రవాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లు అమరిస్తే జరిమానాలు తప్పవని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం నగరంలో మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చిన వాహనాల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఈడ్రైవ్‌లో పట్టుబడిన 79 ద్విచక్రవాహనాలకు అమర్చిన వింత శబ్ద సైలెన్సర్లను తొలిగించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ శబ్దకాలుష్యం సైలెన్సర్లు అమర్చడం వలన ప్రజలు భయభ్రాతులు కలిగేలా రోడ్లపై ఇబ్బందులు గురవుతున్నారని పలు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి తరుచు ఇలాంటి చర్య లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. నెంబర్ ప్లేట్, నెంబర్ సక్రమంగా లేని, నెంబర్ ట్యాంపరింగ్ కలిగిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ తనిఖీల్లో సీఐ మోహన్ బాబు, ఎస్ఐలు రవి, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● 10 తులాల బంగారం 80 తులాల వెండి రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సతీష్‌కుమార్

మణుగూరు, ఏప్రిల్4: మణుగూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో దొంగ తనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు గురువారం పట్టుకున్నారు. సీఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పూల మార్కెట్ ఏరియాలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని పట్టుకుని విచారించామన్నారు. మణుగూరుకు చెందిన గంటా ప్రవీణ్, మాట్ల రాము తాళాలు వేసి ఉన్న ఇళ్లలోకి చొరబడి దొంగతనాలు చేసేవారని తెలిపారు. వీరు సుమారుగా 25 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలను దొంగిలించినట్లు విచారణలో వెల్లడించారని పేర్కొన్నారు. వీరి వద్ద నుంచి 10 తులాల బంగారం, 80 తులాల వెండి పట్టీలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంటా ప్రవీన్‌పై 15 కేసులు ఉన్నాయని, జైలుకు కూడా వెళ్లి వచ్చాడన్నారు. ఇదే కేసులో మధు, సాగర్ అనే వ్యక్తులు పరారీలో ఉన్నారని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ మేడ ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

'గిరిజనులకు పట్టాలు పంపిణీ చేయాలి'

సత్తుపల్లిరూరల్, ఏప్రిల్4: చంద్రాయపాలెం ఘటనపై తక్షణమే ప్రభుత్వం ఎంక్వయిరీ కమిటీ వేసి, పట్టాలున్న భూములను అక్కడి గిరిజనులకు పంపిణీ చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బుగ్గపాడులో బాధిత కుటుంబాలను డివిజన్ కమిటీ బృందం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటనలకు కారణంగా అటవీ శాఖ అవలంభిస్తున్న ద్వంద విధానాలేనని కారణమన్నారు. కార్యక్రమంలో నాయకులు కొంచెం కృష్ణ, వీరమల్ల ఉమా, కొండపనేని సత్యనారాయణ, సవాళ్ల ఆదినారాయణ, సురేష్, దుబ్బా వెంకటేష్, జక్కుల రాంబాబు, వైఎస్.రెడ్డి పాల్గొన్నారు.

ఫారెస్ట్ గార్డుపై పోడు రైతు దాడి

ములకలపల్లి, ఏప్రిల్ 4: మండలం అన్నారం పరిధిలో ఫారెస్టిగార్డుగా పని చేస్తున్న బానోతు పూరపై గురువారం దాడి జరిగింది. స్థానికులు, ఫారెస్ట్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారం ఫారెస్ట్ భూమిలోని చెరువుకుంట నుంచి డీజిల్ ఇంజన్‌తో చోడె చుక్కా అనే పోడురైతు తన పోడుభూమిలో సాగు చేస్తున్న కూరగాయల మొక్కలకు నీరు పెట్టుకునేందుకు వెళ్లగా ఫారెస్ట్ గార్డు పూర ఆ ప్రాంతానికి అడ్డుకున్నాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో పోడు రైతు చుక్కా తన చేతిలో ఉన్న పారతో గార్డు పూర తలపై దాడి చేశాడు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న ములకలపల్లి అటవీ రేంజ్ సిబ్బంది పూరను కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. ములకలపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎం. రవికిరణ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

గుండెపోటుతో వాచ్‌మన్ మృతి

పాల్వంచ, ఏప్రిల్ 4: గుండెపోటుతో వాచ్‌మన్ మృతి చెందిన సంఘటన పాల్వంచలో గురువారం చోటు చేసుకుంది. పాల్వంచ బీసీ హాస్టల్‌లో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆసోదు భాగ్యారావు(60) రోజు మాదిరిగా పిల్లలందరూ భోజనం చేసే వరకు ఉండి, అనంతరం తనకు కేటాయించిన గదిలో నిద్రించాడు. ఉదయం తోటి సహాయకుడు గమనించేసరికి అతడు అపస్మారక స్థితిలో ఉండడంతో కుటుంబ సభ్యులకు, అధికారులకు సమాచారం అందించాడు. మృతుడు కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.

రూ.3కోట్లకు దివాళా పిటీషన్ దాఖలు

ఖమ్మం లీగల్, ఏప్రిల్ 4: ఖమ్మం నగరానికి చెందిన కొంగర రామకృష్ణ 24 మందిని ప్రతివాదులుగా చూపిస్తూ, మొత్తం రూ.3,46,10,539 లకు దివాళా పిటీషన్ దాఖలు చేశాడు. దివాళా దారుడు స్టాక్‌మార్కెట్‌లో పనిచేసేవాడు. అధిక వడ్డీలకు అప్పులు తీసుకొని స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడి పెట్టాడు. రుణదాతల నుంచి ఒత్తిడి అధికమవ్వడంతో మొత్తం 24మందిని ప్రతివాదులుగా చూపిస్తూ తన న్యాయవాదుల ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జికోర్టులో దివాళా పిటీషన్ దాఖలు చేశాడు.

రైలు కింద పడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మధిర, ఏప్రిల్ 4: గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెలియని 30ఏళ్ల యు వకుడు మృతి చెందిన సంఘటన మధిర-మోటమర్రి గ్రామాల మధ్య గురువారం జరిగింది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. కిలోమీటరు 528/3-1 వద్ద ఎగువలైన్‌పై వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి మృతి చెందాడని తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. ఆత్మహత్య చేసుకొని ఉంటాడని భావిస్తున్నారు. ఈ మేరకు మధిర జీఆర్‌పీ అవుట్ పోస్టు ఇన్‌చార్జి వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ శ్రీనివాసరావు సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 87126 58589, 87126 58607 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఫోన్ మాట్లాడుకుంటూ వెళ్తూ..


సురేష్

బోనకల్: రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బోనకల్ రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. బోనకల్ స్టేషన్‌కు చెందిన బండి సురేష్(38) ఖమ్మంలో వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడి భార్య కూడా ఖమ్మంలో ఉద్యానవన శాఖలో పని చేస్తుండటంతో ఇద్దరు కలిసి ఖమ్మం నుంచి నిత్యం బోనకల్‌కు రాకపోకలు సాగిస్తున్నారు. కాగా బుధవారం రాత్రి సమయంలో అతడు పాత రైల్వేగేటు వద్ద ఫోన్లో మాట్లాడుకుంటూ ట్రాక్ దాటే క్రమంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు తగిలి మృతి చెందాడు. రైలు డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలి ఆత్మహత్య

మణుగూరు, ఏప్రిల్4: మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలోని అశోక్‌నగర్‌లో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..అశోక్ నగర్ ప్రాంతంలో నివాసముండే కాంచనపల్లి పద్మావతి(60) కొంత కాలంగా మతిస్థిమితం సరిగ్గా ఉండడం లేదని తెలిపారు. గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని పేర్కొన్నారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించి స్థానికులు ఆమెను మణుగూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు.



ఎన్‌ఆర్‌సీని సందర్శించిన వైద్య విద్యార్థులు


వైద్య విద్యార్థులకు వివరిస్తున్న న్న ఎన్‌ఆర్‌సీ వైద్యులు

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలంలోని జాతీయ పోషకాహార కేంద్రం(ఎన్‌ఆర్‌సీ)ని గురువారం కొత్తగూడెంలోని మెడికల్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సందర్శించారు. క్షేత్రస్థాయి అధ్యయనంలో భాగంగా పోషకాహార కేంద్రంలో పోషకాహార కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వీరికి డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ పూజ, డాక్టర్ జగదీష్ వైద్యసేవల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ మోకాళ్ల వెంకటేశ్వరరావు, డాక్టర్ ముదిగొండ రామకృష్ణ పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా జీఎం ఘన సన్మానం

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 4 : సింగరేణి కొత్తగూడెం ఏరియాలో అధిక ఉత్పత్తి సాధించేందుకు కృషి చేసిన ఏరియా జనరల్ మేనేజరు షాలెం రాజును బీఎంఎస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానించారు. బీఎంఎస్ కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడంతోపాటు బొగ్గు రవాణా చేసేందుకు కృషి చేసిన ఏరియా జీఎం సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు రాజమౌళి, కాసర్ల మోహన్, సత్యనారాయణ, రమేష్, స్వప్న, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేట, ఏప్రిల్ 4: పార్లమెంటు ఎన్నికలకు సబంధించి పోలింగ్ సిబ్బంది అంతా బాధ్యతగా విధులు నిర్వహించాలని తహసీల్దారు కృష్ణప్రసాద్ సూచించారు. అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాలలో గురువారం ఎన్నికల సిబ్బంది(ఓపీవో)కి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 595మందికి శిక్షణను ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ

మణుగూరు: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్నికల నిర్వహణ కోసం నియమితులైన ప్రిసైడింగ్ అధికారులకు మణుగూరులో గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. మణుగూరు ప్రభుత్వ డిగ్రీకాలేజీలో ఈ తరగతులను ఏర్పాటు చేయగా మండల తహసీల్దార్, ఏఏఆర్‌ఓ రాఘవరెడ్డి పలు అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే పోలింగ్ కేంద్రాల నియమాలు, పాటించాల్సిన నిబంధనలను ప్రత్యేక సిబ్బంది రవి కుమార్, తదితరులు ప్రిసైడింగ్ సిబ్బందికి వివరించారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- కలెక్టర్ ప్రియాంక
- కొత్తగూడెంలో అవగాహన ర్యాలీ
- ఓటర్లను చైతన్యపరుస్తున్న అధికారులు

కొత్తగూడెం, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు, వయోవృద్ధులు ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిని ప్రియాంక కోరారు. గురువారం ఓటరు చైతన్య కార్యక్రమంలో ప్రోగ్రాంలో భాగంగా దివ్యాంగులు, వయో వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు ఓటు అవగాహన ర్యాలీని కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు నుంచి జెండా ఊపి ప్రారంభించారు. 'ఓటు మనకు భారం కాదు బాధ్యత' అనే నినాదంతో ర్యాలీ బస్టాండ్ సెంటరకు వరకు సాగింది. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు, 80 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు, పోలింగ్‌స్టేషన్ వరకు వెళ్లలేని దివ్యాంగుల కోసం ఎన్నికల కమిషన్ ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునే వీలు కల్పించిందన్నారు. అందుకు అర్హత ఉన్న వారంతా 12 డి ఫారం నింపాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, బీఎల్‌వోలు సహకరిస్తారని, జిల్లాలో ఉన్న ఓటర్లు తప్పక ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకుని తద్వారా మిగతా ఓటర్లకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంక్షేమ అధికారి వేల్పుల విజేత, డీఆర్‌డీవో విద్యాచందన, టీవీపీఎస్ జి. సతీష్, ఎం. ప్రవీణ్, ఖాదర్‌బాబా, నగేష్ చాంద్‌పాషా, రాజయ్య, కాసీం, ఐసీడీఎస్ అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు: తహసీల్దార్

కరకగూడెం: ప్రతి పౌరుడు తన ఓటు హక్కు వినియోగించుకునేందకు రాజ్యంగం కల్పించిన హక్కు అని కరకగూడెం తహసీల్దార్ నాగ ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని భట్టుపల్లి పంచాయతీలో 'మీ తహసీల్దార్.. మీ ఇంటికే' అనే కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ ఓటు హక్కుపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. డబ్బుకు లోను కాకుండా తన ఓటు స్వేచ్ఛగా వేసేందుకు రాజ్యంగం కల్పించిన హక్కు అని తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ సంధ్య, ఆర్‌ఐలు హుస్సేన్, రాజు, నరేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

ములకలపల్లి: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతీ వ్యక్తి విధిగా తమ ఓటు వినియోగించుకోవాలని ప్రాజెక్టు అధికారిని జ్యోతి తెలిపారు. ఐసీడీఎస్ దమ్మపేట ప్రాజెక్టు ఆధ్వర్యంలో ములకలపల్లి మండల కేంద్రంలో గురువారం 'మీ ఓటే మీ భవిష్యత్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎసీడీపీవో సీతారాములు, సూపర్‌వైజర్లు బి. సామ్రాజ్యం, ఆర్. నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్: 'స్వీప్ ఐ ఓటు ఫర్ ష్యూర్' అనే నినాదంతో సీడీపీవో రోజారాణి ఆధ్వర్యంలో ఓటు


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

అవగాహన ర్యాలీలు నిర్వహించారు. అశ్వారావుపేట పట్టణంలోని కోనేరు బాజార్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిస్తూ ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి. శ్రీనివాసరావు సూపర్ వైజర్స్, కె విజయలక్ష్మి టి. పద్మవతి టీచర్స్, జ్యోతి, అనసూయ్య మనెమ్మ సరస్వతి, నాగమణి, వృద్దులు, ట్రాన్స్‌జెండర్స్ ,తదితరులు పాల్గొన్నారు,

ఓటు హక్కును వినియోగించుకోండి

మణుగూరు: జరగనున్న పార్ల మెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు గల వారు అంతా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని గురువారం మణుగూరు పట్టణంలో మండల అధికారులు ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, ఏపీఎం అహ్మదుల్లా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి నిత్యకల్యాణం గురువారం వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనంను అర్చకులు గావించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే దేవస్థానం నిత్యన్నదాన పథకానికి గుడివాడకు చెందిన శశిదీప్, తులసి దంపతులు రూ.50 వేలను అందజేశారు.

సాయిబాబా ఆలయంలో నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలంలోని సాయిబాబా వారి ఆలయంలో గురువారం బాబాకు ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఐటీసీ ఉద్యోగి మల్లాది వెంకట రామారావు వారి కుటుంబ సభ్యులు రూ.25 వేల విరాళాన్ని ఆలయ కోశాధికారి కుంచాల రమేష్‌కు అందజేశారు. అనంతరం దాతను సత్కరించారు. అలాగే 800 మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.


మెమెంటో అందజేస్తున్న దృశ్యం

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 4: ఇల్లెందు మండల పరిషత్ సర్వసభ్య సమావేశ సాదాసీదాగా కొనసాగింది. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చీమల నాగరత్నమ్మ అధ్యక్షతన గురువారం జరిగిన ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు.వేసవి కాలంలో గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని,వర్షాల మూలంగా గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీటీసీలు అధికారులను కోరారు. మిషన్ భగీరథ పైపులైన్లు లీకేజీ అవుతున్నా అధికారుల పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో ఎంపీడీవో దన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, వివిద శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కూనంనేని, పోలీస్ అధికారుల పరామర్శ


నివాళులర్పిస్తున్న కూనంనేని

జూలూరుపాడు, ఏప్రిల్4: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన యువకుడు, విశ్రాంత సీఐ చనుమోలు సుబ్బారావు కుమారుడు చనుమోలు విఖ్యాత్ (అలియాస్ విక్కీ)(26) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో మృతి చెందాడు. దీంతో గురువారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళ్ళు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి యువకుడు మృతికి సంతాపాన్ని తెలియజేశారు. డీసీఆర్‌బీ డీఎస్పీ నాయుడు మల్లయ్యస్వామి, భద్రాద్రి జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజులతో పాటు, భద్రాద్రి, ఖమ్మం జిల్లాలకు చెందిన పలువురు సీఐలు, ఎస్ఐలు విఖ్యాత్ మృతదేహాన్ని సందర్శించి నివాళ్ళు అర్పించారు. అదేవిధంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, సీపీఐ, టీడీపీ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసుధన్‌రావు, యల్లంకి సత్యనారాయణ, పిజి.కృష్ణమూర్తి, గుండెపిన్ని వెంకటేశ్వర్లు, రోకటి రంగారావు తదితరులు యువకుడి మృతదేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

రామయ్యను దర్శించిన రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి


ఆలయంలో ప్రభుత్వ కార్యదర్శి సురేంద్రమోహన్

భద్రాచలం ఏప్రిల్ 4: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామిని గురువారం రాత్రి రాష్ట్రప్రభుత్వ కార్యదర్శి కె.సురేంద్రమోహన్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. కార్యక్రమంలో భద్రాలం ఆర్డీవో కె.దామోదర్‌రావు, దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వేద పండితులు చిట్టిహనుమత్‌శాస్త్రి, లింగాల రామకృష్ణప్రసాద్, రామాయణ పారాయణదారులు ఎస్జీజి అంతర్వేది కృష్ణమాచార్యులు, రెవెన్యూ, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ అధికారిని మర్యాద పూర్వకంగా కలిసిన ఆర్డీవో

బూర్గంపాడు: తాగునీటి సమస్య ఉన్న గ్రామాలను పర్యవేక్షించేందుకు ప్రభుత్వం తరుపున నియమితులైన ప్రత్యేకాధికారి సురేంద్రమోహన్ గురువారం భద్రాచలంలో పర్యటించారు. స్పెషల్ అధికారిని భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

లోకకల్యాణార్థం ఖగోళయాత్ర

- ఆగస్టు 17న ప్రారంభం..
- సెప్టెంబరు 17న ముగింపు
- భూమిపై అష్టదిక్కుల్లో సీతారాముల కల్యాణం
- అమెరికాలోని అట్లాంటా రామాలయం ప్రధాన అర్చకుడు ప్రద్మనాభాచార్యులు


వివరాలు వెల్లడిస్తున్న అట్లాంటా రామాలయం ప్రధాన అర్చకులు అర్చకం ప్రద్మనాభాచార్యులు

భద్రాచలం, ఏప్రిల్ 4: లోకకల్యాణార్థం వచ్చే ఆగస్టు 17నుంచి సెప్టెంబరు 17వరకు నెలరోజుల పాటు ఖగోళయాత్ర నిర్వహించనున్నట్లు అమెరికాలోని అట్లాంటా రామా లయ ప్రధాన అర్చకుడు అర్చకం ప్రద్మనాభాచార్యులు తెలిపారు. భద్రాచలం పుణ్యక్షేత్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వివరాలు తెలిపారు. తన ఆధ్వర్యంలో 200మంది బృందంతో ప్రత్యేక విమానంలో ఖగోళయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామానుజచార్యులతో పాటు మరో ఇద్దరు అర్చకులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి తీసుకున్నట్లు తెలిపారు. ఆగస్టు 17న అయోధ్య రామాలయం నుంచి ఈ యాత్ర ప్రారంభించి ప్రత్యేక విమానంలో తొలుత తూర్పున ఉన్న కంబోడియా చేరుకుంటామన్నారు. అనంతరం ఆగ్నేయంలో ఉన్న ఆస్ట్రేలియా, దక్షిణంలో ఉన్న దక్షిణాఫ్రికా, నైరుతి దిశలో ఉన్న అర్జెంటీనాకు వెళ్తామన్నారు. ఈ క్రమంలో పశ్చిమాన కాలిఫోర్నియా, వాయువ్యంలో అలస్కా, ఉత్తరాన ఐస్‌ల్యాండ్, ఈశాన్యంలో జపాన్ వెళ్లి తిరిగి కంబోడియా చేరుకొని యాత్ర పూర్తి చేస్తామన్నారు. ఖగోళయాత్ర సందర్భంగా అష్టదిక్కుల్లో శ్రీ సీతారాముల కల్యాణం జరిపిస్తామని వెల్లడిం చారు. కంబోడియానుంచి తిరిగి భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానం చేరుకుంటామన్నారు.

శ్రీరామ గాయత్రి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే

భద్రాచలం, ఏప్రిల్ 4: భద్రాచలంలోని శ్రీరామ గాయత్రి ఆలయాన్ని గురువారం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.రామ బ్రహ్మచారి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మామిడి వీరభద్రం, కాకరాల శర్మ పాల్గొన్నారు.

'అనుబోస్'లో సాఫ్ట్‌స్కిల్స్‌పై వర్క్‌షాప్..

పాల్వంచ, ఏప్రిల్ 4: పాల్వంచ పట్టణంలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో సాఫ్ట్‌స్కిల్స్‌పై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం గురువా రం చివరి రోజు కావడంతో టాస్క్ రీసెర్చ్ పర్సన్ మార్క్ హార్నీ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సెల్ఫ్ అవేర్నెస్, గోల్ సెట్టింగ్, ఇంట్రపర్సనల్ రిలేషన్, హ్యాండ్లింగ్ ఎమోషన్స్, క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లం సాల్వింగ్, డెసిషన్ మేకింగ్ తదితర అంశాల పట్ల ప్రతి విద్యార్థి ఎలా అవగాహన పెంచుకోవాలో ఉదాహరణలతో వివరించారు. ఈ కార్యక్రమంలో కరాశాల చైర్మన్ భరత్‌కృష్ణ, డీన్ డాక్టర్ అవని, వైస్ ప్రిన్సిపాల్ వెంకన్న, టీపీఓ క్రాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పాల్వంచ పోలీసుస్టేషన్ తనిఖీ

పాల్వంచ, ఏప్రిల్ 4: పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ రోహిత్‌రాజు గురువారం రాత్రి సందర్శించారు. సుమారు మూడు గంటల పాటు స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించారు. ఎఫ్ఐఆర్ నమోదు ప్రక్రియ, ఫిర్యాదుల స్వీకరణ, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, భూవివాదాలు, పెండింగ్ కేసుల వివరాలను టౌన్ ఎస్ఐ బానాల రామును అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్, సీఐ వినయ్‌కుమార్ ఉన్నారు.

శివలింగాపురంలో ఆయుర్వేద వైద్య శిబిరం

మణుగూరు, ఏప్రిల్ 4 : మణుగూరు పీహెచ్‌సీ పరిధిలోని శివలింగాపురం గ్రామంలో గురువారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద డాక్టర్ పావని మాట్లాడుతూ.. అన్ని రకాల రుగ్మతలకు ఆయుర్వేదంలో మందులున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి రాంప్రసాద్, ప్రియాభారతి, జయయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానం రద్దుచేయాలి

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 4: విద్య కాషాయికరణకు వ్యతిరేకంగా ఉద్యమాలను ఉదృతం చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం శేషగిరిభవన్‌లో ఏర్పాటుచేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యను కార్పోరేట్ సంస్థలకు అప్పచెప్తుందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలపై ఏఐఎస్‌ఎఫ్ నిరంతరం ఉద్యమాలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఎస్‌కే. ఫహీం, హరీష్, పవన్, సాయి, వంశీ, ఆజిత్, రాజు, శిరీష, సింధు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో పతకం సాధించాలి: కూనంనేని


విద్యార్థిని అభినందిస్తున్న కూనంనేని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్ 4: జాతీయ స్థాయిలో పథకం సాధించి కొత్తగూడెం ఖ్యాతిని ఇనుమడింప చేయాలని విద్యార్థిని బాణోత్ పల్లవిని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు గురువారం కోరి అభినందించారు. ఈ నెల 6 నుంచి 9వరకు బీహార్ రాష్ట్రం పాట్నాలో జరుగనున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గేమ్స్‌లో అండర్ - 17 విభాగంలో పల్లవి పాల్గొననున్నది. పల్లవిది చిట్టి రామవరం. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ స్టెల్లా, పిఈటి అరుణ, క్రీడాకారిణికి అభినందనలు తెలిపారు. క్రీడాకారిణి కోచ్‌లు ఎండీ బాబ్జి, డి.మల్లిఖార్జున్‌రావులను ప్రత్యేకంగా అభినందించారు.

ఏకులపోతమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడిగా దొడ్డా

దమ్మపేట, ఏప్రిల్ 4: మొద్దులగూడెం ఏకుల పోతమ్మ ఆలయ నూతన కమిటి అధ్యక్షుడిగా దొడ్డా భాస్కరరావును గ్రామస్థులు గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇప్పటి వరకు బచ్చు సత్యనారాయణ కమిటి అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏకులపోతమ్మ ఆలయ వద్ద గ్రామస్తులు సమావేశమై ఒక సంవత్సర కాలానికి కమిటిని ఎన్నుకున్నారు. నూతన సభ్యులను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన భాస్కరరావు మాట్లాడుతు గ్రామస్థుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.

రామాలయం నిర్మాణ పనులకు శంకుస్థాపన

అశ్వారావుపేట, ఏప్రిల్ 4: మండల పరిధిలోని గాండ్లగూడెం గిరిజన తండాలో గురువారం నూతన రామాలయ నిర్మాణ పనులకు గ్రామస్థులు శంకుస్థాపన చేశారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పరిసరాల్లోని గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చిన ఈ కార్యక్రమంలో ఎం ఆలీబాబు, భూ క్య ప్రసాదు, శోభన్, శ్రీను, నవీన్, లక్ష్మణ్, సత్రు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆందోళన

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 4: ఇల్లెందు మండలం రాజీవ్‌నగర్ పేదల గుడిసెలకు మంచి నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చే స్తు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. రాజీవ్‌నగర్ గుడిసె వాసుల కష్టాలు తీర్చాలని ఎంపీపీ చీమల నాగరత్నమ్మకు వినతిపత్రం అందజేశారు.



ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

ఖమ్మంలో కమలం వికసించడం ఖాయం: తాండ్ర వినోదరావు


అభివాదం చేస్తున్న బీజేపీ నాయకులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 4: రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఖమ్మంలో కమలం వికసించడం ఖాయమని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ప్రైవేటు పంక్షన్ హాల్‌లో బీజేపీ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్లమెంట్ అభ్యర్థి వినోదరావు కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. కార్యకర్తలు ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాలని ఆయన అన్నారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీని గెలిపిస్తే గిరిజన యూనివర్శిటీని సాధిస్తామని, కొవ్వూరు రైల్లే లైనును పూర్తి చేస్తామన్నారు. ప్రతి పౌరుడికి అభివృద్ధి ఫలాలు అందాలన్నదే బీజేపీ నినాదమన్నారు. సమావేశంలో బీజేపీ పార్లమెంటరీ కార్యదర్శి శ్రీకాంత్, పార్లమెంటరీ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, రాజా, రాంబాబు, తెలుగుదేశం రాష్ట్ర నాయకులు పాలవర్తి సురేష్, అశ్వారావుపేట మండల అధ్యక్షులు బండారి చంద్రశేఖర్, దమ్మపేట అధ్యక్షులు చెన్నారావు, ములకలపల్లి అధ్యక్షుడు శ్రీను, అన్నపురెడ్డిపల్లి అధ్యక్షులు కిరణ్, చంద్రుగొండ అధ్యక్షులు కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ

జూలూరుపాడు, ఏప్రిల్ 4: మండలంలోని అనంతారం గ్రామంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అభయ హస్త వీరాంజనేయస్వామి ఆలయ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు ఏర్పాటు చేశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.


ఆలయంలో ఎమ్మెల్యే కూనంనేని


ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వేణుగోపాలస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

మండలంలోని కాకర్ల పాలగుట్టపై గల శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం కల్యాణం ప్రథమ బ్రహ్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు లేళ్ల వెంకటరెడ్డి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన

అశ్వాపురం ఏప్రిల్ 4: మండలంలో గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. పలు శుభకార్యాలు, దైవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా తుశ్లూరి ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వివాహానికి, అనంతరం గొల్లగూడెం గ్రామంలో జరిగిన వివాహానికి హాజరైన వధువరూలను ఆశీర్వదించారు. అనంతరం మొండికుంట గ్రామంలో పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిరంజీవిని ఆశీర్వదించారు. కొమ్ముగూడెం గ్రామంలో కొర్రాజుల దేవుడి జాతర మహోత్సవంలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ తుక్కాని మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దమ్మపేట, ఏప్రిల్ 4: దమ్మపేట మండలంలో శుక్రవారం విద్యుత్ లైన్‌లకు మర్మతుల కారణంగా విద్యుత్ కు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ మహేష్ గురువారం సాయంత్రం ప్రకటనలో తెలిపారు. లింగాలపల్లి , దమ్మపేట 33కేవి లైన్లు మర్మతులు కారణంగా నాయుడుపేట, లింగాలపల్లి, అంకంపాలెం సబ్‌స్టేషన్ పరిదిలో ఉదయం 9నుంచి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు.

జిల్లాలో శిశుమరణాలను అరికట్టాలి: కలెక్టర్ ప్రియాంక


సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 4: జిల్లాలో శిశు మరణాలను అరికట్టాలని కలెక్టర్ ప్రియాంక అల తెలిపారు. గురువారం ఐడీఓసీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన శిశు మరణాల సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరిగిన 0-5 సంవత్సరాల్లోపు శిశు మరణాల వివరాలు అడిగి తెలుసుకుని వాటి నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో శిశు మరణాల నివారణకు వైద్యాధికారులు, గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు ప్రజలకు అవగాహన కల్పించాలని, చిన్న పిల్లలకు ఏదైన ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలని ఆదేశించారు. జిల్లాలోని ఆసుపత్రుల్లో అన్ని రకాల ఎమర్జెన్సీ మందులు అందుబాటులో ఉంచాలని, చిన్నారుల మరణాలు జరగకుండ వైద్యం అందించాలని వైద్య విధాన పరిషత్, ఎంసీహెచ్ రామవరం వైద్యాధికారులను ఆదేశించారు. శిశు మరణాల సమీక్ష సమావేశానికి జిల్లాలోని వైద్యాధికారులందరు హాజరుకావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శిరీష, డిప్యూటి డీఎంహెచ్‌వో డాక్టర్ సుకృత, డీఐవో డాక్టర్ బాలాజీనాయక్, కొత్తగూడెం సర్వజన ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహారావు, ఆర్ఎంవోలు డాక్టర్ వీరబాబు, పుష్పలత, భద్రాచలం, పాల్వంచ ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.